క్లుప్తంగా

బ్యాడ్మింటన్ విజేతలకు బహుమతుల పంపిణీ

మలికిపురం: స్థానిక శ్రీరామా బ్యాడ్మింటన్ అకాడమీ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా జరుగుతున్న బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ముగిశాయి. డబుల్స్ విన్నర్‌గా రెడ్ కలర్ టీమ్, డబుల్స్ రన్నర్‌గా నావీ బ్లూ కలర్ టీమ్ విజేతలుగా నిలిచాయి. బ్లాక్ కలర్‌టీ మూడో బహుమతి పొందింది. స్థానిక ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ పోటీల్లో ఆరు జట్లు పాల్గొన్నాయి. అకాడమీ అధినేత దెందుకూరి రాంబాబు చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పెదపాటి జాన్, నల్లి శివకుమార్, షేక్ వినయ్ బాజీ, హరికృష్ణ, రవి, సత్తిరాజు, పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

బాలాజీ స్వామికి రూ.1.57 లక్షల ఆదాయం

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామికి వివిధ సేవల ద్వారా రూ.1.57 లక్షల ఆదాయం వచ్చింది. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1.05 లక్షలు రాగా, నిత్యాన్నదానం ట్రస్టుకు రూ.52,521 విరాళాలుగా సమర్పించారు. 3,075 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకోగా, 2,194 మంది స్వామి వారి అన్న ప్రసాదం స్వీకరించారని ఆలయ ఈఓ జి.మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ తెలిపారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.10 వేల విరాళం


రవితేజ దంపతులకు స్వామి చిత్రపటం అందిస్తున్న చైర్మన్ రామకృష్ణ

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు అమలాపురం రూరల్ మండలం పేరూరుకు చెందిన ఆచార్ల రవితేజ–రమ్య దంపతులు ఆదివారం రూ.10 వేలు విరాళంగా అందించారు. ఈ విరాళాన్ని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణకు అందించారు. దాత కుటుంబ సభ్యులను అభినందించి వారికి స్వామి వారి చిత్రపటంతో పాటు ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యుడు చిట్టాల సత్తిబాబు, ఉప ప్రధానార్చకులు మద్దాలి తిరుమల శింగరాచార్యులు, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్

రావులపాలెం: దేశంలో ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో అమలవుతున్నాయని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. అలాగే బడుగు, బలహీనులకు, కులమతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని ఎమ్మెల్సీ అన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీని బలపరుస్తూ మాదిగల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు నేకూరి రాజేష్‌కుమార్, కొల్లు శ్యామ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిధిగా హాజరైన ఎమ్మెల్సీ మాట్లాడుతూ దళితులంతా నిరంతరం వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలన్నారు. ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్‌ని మాల, మాదిగ, రెల్లి కుల కార్పొరేషన్లుగా విడగొట్టి మనకంటూ ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేశారన్నారు. వైఎస్సార్ విదేశీ విద్య దీవెన పథకం ద్వారా చదువుకునే విద్యార్థులకు ఒక కోటి 20 లక్షలు స్కాలర్ షిప్‌ను అందిస్తుందని, జగనన్న ప్రభుత్వం విద్యకు, వైద్యానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుందని, జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని అనేక రకాలైన పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇచ్చి మన రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కోడేలి సురేష్, మల్లవరపు శ్రీనివాస్, సిర్రా సూరిబాబు, చిద్దుల వెంకటరమణ, ఉండ్రాజవరపు ప్రసాద్ బాబు, చెయ్యేటి రాజశేఖర్, తాతపూడి అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణతత్వం మహోన్నతం

అయినవిల్లి: శ్రీకృష్ణుని తత్వం మనకు బోధపడదని మహోన్నతమైనదని శ్రీనివాస ప్రభుజీ అన్నారు. ఆదివారం నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణమందిర్‌లో ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. శ్రీనివాస ప్రభుజీ మాట్లాడుతూ శ్రీకృష్ణుడు కష్టకాలంలో ఆదుకుంటాడన్నారు. ఆయన లేని స్థలం ఎక్కడ లేదన్నారు. ఆయన్నూ గుర్తించడం కష్టమైన పనే అన్నారు. ఆయన ఎక్కడ పడితే అక్కడ ఉన్నారు. అణువణువు ఆయనే రక్షణగా ఉండి కాపాడుతున్నారన్నారు. శ్రీకృష్ణనామం నిత్యం స్మరించిన వారికి ఏ లోటు ఉండదన్నారు.


మామిడికుదురు మండలం మగటపల్లిలో లక్ష కుంకుమార్చనల్లో పాల్గొన్న మహిళలు


అంబాజీపేటలో వాసవీ మాతకు సారె తీసుకువస్తున్న ఆర్యవైశ్య మహిళలు

కాపాడవమ్మా.. కనకదుర్గమ్మా..


మామిడికుదురు మండలం పెదపట్నంలంకలో మహాగౌరి అలంకారంలో కనకదుర్గమ్మ


తాటికాయలవారిపాలెంలో మహిషాసుర మర్దినిగా అమ్మవారు


ఉచ్చిలిలో విజయదుర్గాదేవిగా అమ్మవారు


కొత్తపేట బి.సావరంలో చండీహోమం నిర్వహిస్తున్న భక్త దంపతులు


ఊబలంకలో శాకంబరిగా జగన్మాత

- ఘనంగా దుర్గాష్టమి పూజలు
- పాల్గొన్న భక్తులు

మామిడికుదురు/కొత్తపేట/పి.గన్నవరం/ఆత్రేయపురం/అంబాజీపేట/రావులపాలెం: పలు మండలాల్లో దసరా వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. అమ్మవార్లు పలు ఆలయాల్లో పలు అవతారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవార్లకు కుంకుమ పూజలు చేశారు. అలాగే దసరా నవరాత్రుల సందర్భంగా ఆలయాల్లో ఏర్పాటు చేసిన పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి.

రక్త పరీక్షలే ప్రామాణికం

- జగనన్న ఆరోగ్య సురక్షలో వేలాది మందికి సేవలు
- శిబిరంలో 14 రకాల వైద్య పరీక్షలు
- వ్యాధి నిర్ధారణకు అనుగుణంగా చికిత్స

అలమూరు: రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించేందుకు వ్యయ ప్రయాసల కోర్చి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన లభిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో అందిస్తున్న సేవల చూసి అబ్బురపడుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో 63 రకాల రక్త పరీక్షలు చేస్తుండగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో అక్కడికక్కడే సుశిక్షితులైన లాబ్ టెక్నీషియన్లతో 14 రకాల పరీక్షలు నిర్వహించి రోగ నిర్ధారణ చేస్తున్నారు. ఈ శిబిరం ఏర్పాటు వల్ల అనేక మంది దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన పెంచుకుని దానికనుగుణంగా చికిత్స పొందుతున్నారు. క్లస్టర్ పరిధిలోని రాజోలు, పి.గన్నవరం, కొత్తపేట నియోజకవర్గాల పరిధిలో ఉన్న 256 గ్రామ సచివాలయాల పరిధిలో ఇప్పటికే సుమారు 210 సచివాలయాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ఏర్పాటు పూర్తయింది. ఒక్కో శిబిరంలో ప్రతి రోజు సుమారు 400 నుంచి 500 మందికి వైద్య సేవలు అందిస్తుండగా అందులో సుమారు 90 శాతం మంది రక్త పరీక్షలు చేయించుకుంటున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా నిర్వహించే పరీక్షలు

జగనన్న ఆరోగ్య సురక్షలో ప్రస్తుతం 14 రకాల రక్త పరీక్షలు నిర్వహిస్తుండగా వ్యాధి తీవ్రతను బట్టి అవసరమైన రోగులకు మరిన్ని పరీక్షలు చేసేందుకు సమీప ఆరోగ్య కేంద్రాలకు సిఫారసు చేస్తున్నారు. బ్లడ్ సుగర్, బ్లడ్ యూరియా, రక్తపోటు, హిమోగ్లోబిన్, హెచ్ఐవీతో పాటు హైపటైటిస్–బీ, డెంగీ, బ్లెడ్ క్లాటింగ్ టైమ్, థైరాయిడ్, పొటాషియం, క్లోరైడ్, ప్లేట్‌లెట్ కౌంట్, సీబీసీ, టోటల్ సెల్ కౌంట్, సీరం సోడియం, తదితర 63 రకాల వైద్య పరీక్షలు ప్రతిరోజు రోగులకు అందుతున్నాయి.


సంధిపూడిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో నేత్ర వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

అధునాతన పరికరాలతో పరీక్షలు



రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చిన అధునాతన పరికరాలతో రోగులకు మెరుగైన వైద్య పరీక్షలు చేస్తున్నాం. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 14 పరీక్షలు, ఆస్పత్రుల్లో దాదాపు 60 వరకూ పరీక్షలు నిర్వహిస్తున్నాం దీనివల్ల రోగ నిర్ధారణ సత్వరమే జరుగుతుంది. మెరుగైన చికిత్సను అందించేందుకు దోహదపడుతుంది.

– పి.రాజా రమేష్‌కుమార్, ల్యాబ్ టెక్నీషియన్, పెదపళ్ల

సురక్ష సేవలతో ఎంతో మేలు



రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్యం కోసం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సేవలు మాలాంటి మహిళలకు ప్రయోజనకరంగా ఉన్నాయి. వైద్యులు గ్రామాలకే వచ్చి సేవలు అందించి మెరుగైన ఆరోగ్యానికి కృషి చేస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులకు ఉచితంగా మందులను అందించడం అభినందనీయం.

– బిక్కవోలు మంగ, మూలస్థాన అగ్రహారం

గ్రంథాలయాలు విజ్ఞానానికి నిలయాలు

రాజోలు: గ్రంథాలయాలు విజ్ఞానానికి నిలయాలని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. ఆదివారం పొన్నమండలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విజ్ఞాన సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఎమ్మెల్యే రాపాక ప్రారంభించారు. సుమారు రూ.రెండు లక్షల విలువైన విద్య, వైద్య, ఇంజినీరింగ్ వివిధ రకాల పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను గ్రంథాలయంలో కొలువుదీర్చారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ పుస్తక పఠనం యువతకు ఎంతో మేలు చేస్తుందన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విజ్ఞాన సేవా సమితి సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. సర్పంచ్ కుక్కల బేబికుమారి, జెడ్పీటీసీ మట్టా శైలజ, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.


పొన్నమండలో నూతన గ్రంథాలయ ప్రారంభ సభలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాపాక

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

మధుర స్మృతుల మననం

మామిడికుదురు: నాలుగు దశాబ్దాల క్రితం పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి మామిడికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆదివారం వేదికగా నిలిచింది. మామిడికుదురు గోకవరపు గణాధిపతి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1980–81 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు విజయదశమిని పురస్కరించుకుని ఒక చోట చేరి నాటి మధుర స్మృతులను మననం చేసుకున్నారు. నాటి చిలిపి సంఘటనలను గుర్తు చేసుకుని అంతా ఆనందంగా గడిపారు. మ్యూజికల్ చైర్స్ ఆడి సందడి చేశారు. పాటలు పాడి అలరించారు. అంతా ఒక చోట చేరి సహపంక్తి భోజనాలు చేశారు. తమ తమ కుటుంబ నేపథ్యాలను స్నేహితులతో పంచుకున్నారు. తమకు విద్య నేర్పిన గురువులు అంబటి సత్యనారాయణ, యెరుబండి భాస్కరరావు, నీతిపూడి చంద్రరావులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం ఆద్యంతం ఆహ్లాదకర వాతావరణంలో జరిగింది.


మామిడికుదురులో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

చాలా ఆనందంగా ఉంది



నా స్వగ్రామం అప్పనపల్లి. నేను పదో తరగతి వరకు ఇక్కడే చదువుకున్నా. ఉద్యోగ రీత్యా నిత్యం బిజీగా ఉంటున్నాం. క్షణం తీరిక లేని సమయంలో పూర్వ విద్యార్థుల కలయిక ఎంతో ఆనందం కలిగించింది. నాలుగు దశాబ్దాల క్రితం కలిసి చదువుకున్న మిత్రులను ఈ విధంగా కలుసుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఈ తరహా సమావేశాలు తరచూ జరగాలని ఆకాంక్షిస్తున్నా.

– ఎన్‌వీవీ సత్యనారాయణ, ఆర్డీఓ, కాకినాడ

ఎంతో కష్టపడి చదువుకున్నాం



ఆదుర్రు శివారు మోరిపాలెం నా స్వగ్రామం. అక్కడి నుంచి ప్రతి రోజు ఇక్కడకు వచ్చి చదువుకునేవాడ్ని. అప్పటి పరిస్థితుల వేరు. ఇప్పటి పరిస్థితులు వేరు. ఎంతో కష్టపడి చదువుకున్నాం. పదో తరగతి పూర్తైన వెంటనే పోలీస్ ఉద్యోగం వచ్చింది. పోలీస్ శాఖలో 40 ఏళ్ల సర్వీసు పూర్తి చేశా. మిత్రులను ఈ విధంగా కలుసుకోవడం చాలా ఆనందంగా ఉంది.

– కె.రాజేంద్రకుమార్, ఏఎస్సై, విశాఖపట్నం

నాటి మధురస్మృతులను గుర్తు చేసుకున్నాం



నాది మామిడికుదురు. నేను గూడపల్లి ఎంపీపీఎస్ స్కూల్ హెచ్‌ఎంగా పని చేస్తున్నా. నాలుగు దశాబ్దాల క్రితం కలిసి చదువుకున్న మిత్రులను దసరా సందర్భంగా కలుసుకోవడం చాలా సంతోషంగా ఉంది. అంతా కలిసి ఒకచోట చేరి చదువుకున్న రోజుల నాటి మధురస్మృతులను గుర్తు చేసుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఈ సంతోషాన్ని మాటల్లో చెప్పలేకపోతున్నా.

– నయినాల రాధ, ఎంపీపీ పీఎస్ హెచ్‌ఎం, గూడపల్లి

భవానీ మాలధారుల పాదయాత్ర


పాదయాత్ర చేస్తున్న భవానీ మాలధారులకు సంఘీభావం తెలుపుతున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

అలమూరు/రావులపాలెం: పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు అనేక సంక్షేమ పథకాలు చేస్తున్న సీఎం జగన్ మళ్లీ అధికారంలోకి రావాలని, నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి నాలుగో సారి మళ్లీ విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ మండలంలోని చెముడులంకకు చెందిన భవానీ మాలధారులు పాదయాత్ర చేపట్టారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, సర్పంచ్ తమ్మన శ్రీనివాసు ఆధ్వర్యంలో భవానీ మాలధారుల బృందం ఆదివారం స్థానిక దుర్గాదేవి పీఠం నుంచి కోనసీమ తిరుపతిగా భాసిల్లుతున్న ఆత్రేయపురం మండలంలోని వాడపల్లిలో వేంచేసిన వేంకటేశ్వర స్వామి ఆలయానికి పాదయాత్ర చేపట్టారు. రావులపాలెంలో భవానీ మాలధారులకు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సాదర స్వాగతం పలికి అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. భవానీ మాలధారులతో కొంతదూరం ఆయన కూడా పాదయాత్రలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు.

వాడపల్లి వెంకన్న సన్నిధిలో సినీనటుడు నాగినీడు


నాగినీడుకు స్వామి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రముఖ సినీనటుడు, నంది అవార్డు గ్రహీత వెల్లంకి నాగినీడు స్వామి వార్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలో స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆయనకు స్వామి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

పీకే రావుకు జెడ్పీ చైర్మన్ అభినందన


పీకే రావును అభినందిస్తున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

అంబాజీపేట: రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన పీకే రావును జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ఆయన స్వగృహంలో అభినందించారు. పీకే రావును దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ప్రతిగా జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావును ఘనంగా పీకే రావు సన్మానించారు. కార్యక్రమంలో అడ్డగళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు


పెద్దింటి పాండు (ఫైల్)

ఆత్రేయపురం: ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం చిన్న పాలపర్రు గ్రామానికి చెందిన పెద్దింటి పాండు ఈనెల 21 నుంచి కనిపించడం లేదని పాండు కుమారుడు పెద్దింటి స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై బీవై కిరణ్‌కుమార్ తెలిపారు. ఈనెల 21న వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి వచ్చి అప్పటి నుంచి కనిపించక పోవడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అంతర్వేది ఆలయానికి పోటెత్తిన భక్తులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. దేవీ శరన్నవరాత్రులు పురస్కరించుకుని స్థానికులతో పాటు స్థానికేతరులు పుణ్యక్షేత్రంలోని కొలువైన లక్ష్మీనృసింహునికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే స్వామివారి సోదరి గుర్రాలక్క అమ్మవారి ఆలయంలోను, ప్రధాన ఆలయంలోని ఉపాలయంలోని రాజ్యలక్ష్మి అమ్మవారి వద్ద కూడా భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ దేవీ శరన్నవరాత్ర మహోత్సవాల సందర్భంగా ఆలయంలో భక్తులకు తగిన ఏర్పాట్లు చేశారు. పుణ్యక్షేత్రానికి తరలి వచ్చిన భక్తులకు నిత్యాన్నదాన పథకంలో భక్తులకు భోజన వసతిని ఏసీ కల్పించారు. కాగా ఆలయంలో సాధారణ, ప్రత్యేక దర్శనాల ద్వారా 7500 మంది భక్తులు స్వామివారి దర్శించుకున్నట్టు సత్యనారాయణ తెలిపారు. సుదర్శన హోమంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నట్టు ఆయన చెప్పారు.

ప్రజా శ్రేయస్సే సీఎం జగన్ ఏకైక లక్ష్యం


గూడపల్లిలో మహిళకు పథకాలు ఇస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: రాష్ట్ర ప్రజానీకం శ్రేయస్సే సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఏకైక లక్ష్యమని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని గూడపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వారికి ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాల వివరాలను, అందుతున్న తీరును లబ్ధిదారులను నేరుగా అడిగి ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జనమంతా మెచ్చే విధంగా పాలన సాగించడం సీఎం జగన్ కే సాధ్యమైందన్నారు, రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలను అందించిన ఏకైక సీఎంగా జగన్ కీర్తికెక్కారని అన్నారు. ప్రభుత్వం అంటే ప్రజల కోసం పని చేయడమేనని నమ్మిన వ్యక్తి సీఎం జగన్ అన్నారు. అందుకోసమే అహర్నిశలూ ఆయన శ్రమిస్తారని అన్నారు. గత ప్రభుత్వాల పనితీరు, ప్రస్తుత సీఎం జగన్ పని తీరు ప్రజలు బేరీజు వేసుకోవాలని ఆయన కోరారు. ప్రతిపక్షాలు లేనిపోని బురద జల్లేందుకే ప్రయత్నిస్తున్నాయన్నారు. ప్రజలు విజ్ఞతతో వ్యవహరిస్తారని ఎమ్మెల్యే అన్నారు. గ్రామాల్లో ఓట్లడిగే అర్హత ఒక్క వైఎస్సార్ సీపీకే ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుందర తాతాజీ, మోకా ఉదయ భాస్కర్, దూది సాయిబాబు, కొల్లాబత్తుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితుడికి సాయం

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి వైద్యం కోసం స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.15 వేల నగదు సాయం అందజేశారు. కాకినాడకి చెందిన నామన రామ దుర్గ మణికంఠకి రెండు కిడ్నీలు పాడైపోయి కిడ్నీ మార్చాలని డాక్టర్లు తెలిపారు. ఈ వైద్యానికి సుమారు రూ.30 లక్షల వరకు ఖర్చవుతుందన్నారు. పేదరికంలో ఉన్న మణికంఠ కుటుంబ సభ్యులు దాతల సాయం కోసం చూస్తున్నారు. దీంతో మణికంఠకు సాయం చేయాలని బంధువులు కోరగా ఆదివారం రావులపాలెంలో మణికంఠ బంధువు కోటిపల్లి శ్రీనుకు రూ.15 వేల నగదును సాయంగా కాశీ అన్నపూర్ణ సేవా సంస్థ సభ్యులు అందజేశారు.